# తెచ్చుకున్న కయ్యం

ఎందుకిలా జరిగింది? - అనుకుని బాధపడ్డాడు గురునాథం. ఆ బాధ చాపకింద నీరులా మనస్సుని ఆక్రమించింది. దాంతో మనశ్శాంతి కోల్పోయాడు.

తనకు ఆలస్యంగానే వివాహం జరిగింది. వివాహం జరిగిన ఆరేళ్లకుగాని సంతానం కలగలేదు. అది పురుషసంతానం కావడం వల్ల, ఆ దంపతులు మరో సంతానం కోసం ఎదురు చూడలేదు. పైగా ఆయన భార్యకు ఎప్పుడూ అనారోగ్యమే. అందువల్ల మరో సంతానంపట్ల ఉభయులకూ విరక్తి యేర్పడింది. అదీ తన మంచికోసమే అనుకున్నాడిప్పుడు గురునాథం. చివరికి సంతాన మన్నమాట వినిపిస్తే చాలు మండిపడసాగాడు. ఒకప్పుడు సంతానం కోసం తపించిపోయాడు. పుట్టిన ఒక్కగాని ఒక్క కొడుకు-భానుమూర్తి-పెరిగి పెద్దవాడు కావాలనీ, విద్యాబుద్ధులు నేర్చి సంఘంలో పేరు పెంపులు గడించాలనీ, ధన, కనక, వస్తు వాహనాలు పొందాలనీ...యింకా ఏవేవో కలలు కన్నాడు. తన సంతానం విషయంలో ప్రతితండ్రీ ఆశించినట్లుగానే ఆయనా ఆశించాడు. అందులో తప్పు రవంతైనా లేదనుకున్నాడు గురునాథం. అయితే ఎక్కడ జరిగినట్లు తప్పు? అదే ఆయనకి అంతుపట్టలేదు, ఎంతగా తల బ్రద్దలు కొట్టుకున్నా.

క్రమశిక్షణతో పెంచాడు కొడుకుని. అప్పుడప్పుడు భార్య అనేది; 'మరీ అంత భయం పనికి రాదండీ. వాడికి నచ్చిన కథల పుస్తకం చదవడానికిక్కూడా మీ పర్మిషన్ కావాలంటే, అది నాకు క్రూరంగా కనిపిస్తోందండీ. వాడు కాబట్టి సరిపోయింది. మరొకడైతేనా ఎదురు

తిరిగివుండేవాడు. వాడు కనక ఎదురు తిరిగితే, మీ గౌరవం పెద్దరికం ఏం కాను?...' ఆవిడ మాటల్ని ఆయన పెడ చెవిని పెట్టినప్పుడు తన మూగబాధను సనసన్నగా తెలియజేసేది. తనను విమర్శిస్తున్నట్టుగా గురునాథం భావించాడు. అంతేకాని ఆవిడ మాటల్ని పట్టించుకోలేదు. ఒక్కొక్కసారి సహనం నశించి, 'నీకు పిల్లవాణ్ణి ఎలాపెంచాలో తెలీదు. ఉపాధ్యాయశిక్షణ పొందిన నన్నే తప్పు పడుతున్నావుగా...' అంటూ పురుషాధిక్యధోరణిలో ప్రసంగం చేసి, ఆవిడ నోరు మూయించేవాడు. లోలోన బాధపడేది.

ఆయన ఆశించినట్టుగా భానుమూర్తి చదువుసంధ్యలు చక్కగా నేర్చాడు. తరగతిలోనేకాక బయటకూడా మంచి కుర్రాడనే పేరు తెచ్చుకున్నాడు. ఒక్కొక్కసారి తన క్రమశిక్షణను చూసి తానే మెచ్చుకునేవాడు. పిల్లలు అల్లరి చిల్లరిగా తిరుగుతూ చదువురాని మొద్దుల్లా తయారయితే అందుకు బాధ్యత తల్లిదండ్రులదే అనుకునేవాడు. అలాంటి గురునాథం యిప్పుడు సంతానమంటే ఎందుకు మండిపడుతున్నట్టు? నోట్లో నాలుకలేనివాడని నలుగురి మెప్పుపొందిన భానుమూర్తి యిప్పుడింత కఠినంగా ఎలా మాట్లాడగలిగాడు? ఎందుకు తన మనస్సుని గాయపరిచాడు?

చదువులో కొడుకు బృహస్పతి కావడంతో గురునాథానికి సంతోషమూ ఉత్సాహమూ ఏకకాలంలో కలిగాయి. ఎలాగైనాసరే కొడుకుని డాక్టరు చెయ్యాలనుకున్నాడు. అందుకు తగిన ఆర్థికస్తోమత తనకు లేదన్న విషయం ఆయనికి తెలుసు. అయితే తన వద్ద కష్టించి ధనార్జన చేసే గుణం, పొదుపరితనం, తన అవసరాలను పరిమితం చేసుకుని కొడుకుని చదివించాలన్న దీక్షాగుణం మొదలైనవి ఉన్నవనీ ఆయనకి తెలుసు. ఆ విశిష్ట గుణాలను కొడుకుకోసం మీదుకట్టాలనుకున్నాడు. తత్ఫలితంగా భార్యాభర్తలమధ్య అప్పుడప్పుడు చిన్నచిన్న తగాదాలు ఏర్పడేవి. వాటిని గురునాథం సరకుసేయలేదు. ఆయన ఏకైక లక్ష్యం కన్న కుమారుడు డాక్టరయి రెండుచేతులా సంపాదించాలి; తన వృద్ధాప్యం చీకు చింతలు

లేకుండా సవ్యంగా సాగిపోవాలి. అది గౌంతెమ్మ కోరికగా తోచింది గురునాధం భార్యకు. కాని భర్తకు భయపడి కిమ్మనకుండా కూర్చుంది.

వాళ్లనీ వీళ్లనీ ఆశ్రయించి గురునాధం కొడుక్కి మెడికల్ సీటు సంపాదించాడు. రాబడికి మించిన ఖర్చు చేశాడని చుట్టుప్రక్కల వాళ్లు చెప్పుకున్నారు. కొడుక్కి సీటురావడం వల్ల గురునాధం వాళ్లమాటల్ని గడ్డిపోచలుగా జమ కట్టాడు. తన లక్ష్యం చాలా వరకు నెరవేరినట్లుగా భావించి ఉబ్బితబ్బిబ్బు చెందాడు. కొడుకుది పాదరసంలాంటి బుద్ధి కాబట్టి, ఆయన యిబ్బంది పడలేదు-ఒక్కడబ్బు విషయంలో తప్ప.

గురునాధం ట్యూషన్లు ఎక్కువగా పెట్టుకున్నాడు. తీరిక తక్కువ కావడం, శ్రమ ఎక్కువ కావడంతో ఆరోగ్యం కొంచెం చెడింది. ఇంటిని చిన్నస్కూలుగా మార్చివేయడంతో ఇరుగుపొరుగు వాళ్లు ఈర్ష్య చెందారు. స్కూలులో సరిగా పాఠాలు చెప్పకుండా విద్యార్థుల్ని యింటికే రప్పించుకుంటున్నాడనీ, వీలునిబట్టి అడ్డదోవలు తొక్కి విద్యార్థుల్ని ఆకర్షిస్తున్నాడనీ గిట్టనివాళ్లు పనికట్టుకుని ప్రచారం చెయ్యసాగారు. 'అయ్యా గురునాధం గారూ, యీ మధ్య మా అబ్బాయికి పెళ్లయిన సంగతి మీకు తెలుసుగా. ఈ యింట్లోకి మేం మారదలుచుకున్నాం. మీరెంత త్వరగా యిల్లు ఖాళీచేస్తే మా కంతమంచిది' అని గురునాధం అద్దెకున్న యింటి యజమాని నోటీసు యిచ్చాడు. ఆయన అద్దెకున్న యిల్లు మంచిసెంటరులో ఉంది. పైగా తక్కువ అద్దె. ఖాళీ చేస్తే, అలాంటి యిల్లు మళ్లీ దొరకదు. ఇంటి యజమానికి ఎక్కువ అద్దె ఎరచూపాడు. వాళ్ల అమ్మాయికి ఉచితంగానే ట్యూషన్ చెపుతానన్నాడు. లాభం లేకపోయింది. చివరికి యిల్లు ఖాళీచెయ్యక తప్పలేదు. ఊరి చివరన కొత్తగా ఏర్పడుతున్న ఒక కాలనీలో తక్కువ అద్దెకు చిన్నయిల్లొకటి తీసుకున్నాడు. అంతదూరం విద్యార్థులు రావడం కష్టం కనుక, ఊరికి మధ్య ఒక పాతడాబా వుంటే, అతికష్టంమీద ఒక గది అద్దెకు తీసుకున్నాడు. అందువల్ల ఖర్చులు ఎక్కువయ్యాయి. తీరిక బాగా లోపించింది. మందు ఖర్చులు కూడా మోపెడు కాసాగాయి. ఊరికి

చివరలో వున్న కాలనీ కావడం వల్ల దొంగల భయం ఉండేది. దురదృష్టవశాత్తు, గురునాథం యింట్లో ఒకసారి దొంగలు పడ్డారు. పెళ్లినాడు పుట్టింటివారు ఆయన భార్యకు పెట్టిన నగలు, పట్టుచీరలు మొదలైనవి దొంగలు ఎత్తుకు పోయారు...ఇలా కష్టపరంపరకు లోనయ్యాడు గురునాథం. ఆ విషయాలన్నీ భానుమూర్తికి తెలుసు. తన అభ్యున్నతికోసం తల్లిదండ్రులు యమయాతన పడుతున్నారనీ కడుపులు మాడ్చుకుంటున్నారనీ అతను గ్రహించకపోలేదు.

ఎలాగయితేనేం, గురునాథం లక్ష్యం నెరవేరింది. కొడుకు డాక్టరయ్యాడు. ఆ సంతోషంలో తాము పడిన మాటలు కష్టాలు–అన్నీ మరచిపోయారు గురునాథం దంపతులు.

ఇప్పుడు కొత్త సమస్య తలెత్తింది.

ఒక ఆదివారం ఉదయం. వారానికి సరిపడే కాయగూరలు తెచ్చుకోవడం గురునాథానికి అలవాటు. ఆ అలవాటు ప్రకారంమార్కెట్టుకివెళ్లి, కూరల సంచితో యింటికి తిరుగుముఖం పట్టాడు. ఇంకా ఏడెనిమిది యిళ్లు దాటితే యిల్లు వస్తుందనగా, తమ యింటి ముందు ఒక నల్లకారు నిలిచివుండడం చూశాడు. కొంచెం ఆశ్చర్యంలో మునిగిపోయాడు. తమ యింటికి కారులో వచ్చేవారెవరూ లేరే. అలాంటి బంధుమిత్రులు తనకు లేరు. కారులో యింటికి వచ్చి అప్పులు వసూలు చేసేవాళ్లూలేరు. ఎవరా అనుకుంటూ యింట్లోకి అడుగుపెట్టాడు. ఎవరితో గొంతు వినిపిస్తోంది. పరిచితమైన గొంతులా వుంది.

'రండి రండి గురునాథం గారూ... కులాసాగా వున్నారా?' అంటూ కుర్చీలోంచి లేచాడు ఆ వచ్చిన వ్యక్తి.

'మీరా పురుషోత్తంగారూ...కులాసాగా వున్నారుగా...' కూరలసంచీ ఒక మూల పెడుతూ అన్నాడు గురునాథం. 'ఎవరో అనుకున్నా.... బహుకాలదర్శనం...మీ యింట్లో అంతా కులాసాగా వున్నారనుకుంటా...'

'తమలాంటి పెద్దల దయవల్ల'

'ఎంత మాట! మీ రాకతో ఇవ్వాళ్ల మా ఇల్లు పావన మయిందనుకోండి....'

అప్పుడే నలుగురైదుగురు పిల్లలు కారు చుట్టూ చేరారు. అంగాంగ పరీక్ష చేశారు. ఆశ్చర్యం, సంతోషం, భయం ముప్పిరిగొనగా, 'భలే బాగుందిరా కారు, మా యిల్లంత వుంది.

ముట్టుకుంటే పాడయిపోతుందేమో...' పిల్లల మాటలు వినిపిస్తున్నాయి.

'కొత్త కారు కనపిస్తే చాలు, పిల్లమూకకి ఎక్కడలేని మాటలూ పుట్టుకొస్తాయి. ఇలాంటి పేటల్లోకి కారు తీసుకురావడమంటే నాకు భయం సుమండీ...' అంటూ పురుషోత్తం వాకిట్లోకి వెళ్లి, 'పిల్లలూ యిక్కడ మీకేం పని...కారు ముట్టుకోకండి' అని కేకలు వేశాడు. ఆ కేకలకు భయపడి కాబోలు గుమిగూడిన పిల్లలు పరుగు లంకించుకున్నారు. అప్పుడు పురుషోత్తం లోపలికి వచ్చి కూర్చున్నాడు.

'అన్ని విషయాలు ఈ పిల్లమూకకే కావాలండి. కారు ఎలా వుంటే వాళ్లకెందుకు చెప్పండి...'

'మరే అన్నారుగా...వాళ్లు పిల్లలని...అందుకే వింతగా ఆశ్చర్యంగా చూస్తారు.' అన్నాడు గురునాథం పిల్లల్ని సమర్థిస్తూ, నవ్వుతూ.

ఇంతలో గురునాథం భార్య కాఫీ ట్రేతో హాలులోకి వచ్చింది.

'తీసుకోండి...చల్లారితే బావుండదు...'

వాళ్లిద్దరూ కాఫీ తాగి ముగించారు.

'మీ అబ్బాయి ప్రయోజకు డయ్యాడు. చాలా సంతోషం. ఇప్పుడేం చేస్తున్నాడు? ప్రాక్టీసు పెడితే, నాకు తోచిన సహాయం చేస్తాను...' పురుషోత్తం చెప్పుకుపోతున్నాడు. ఆయన మాటలు గురునాథానికి వినిపించినట్టులేదు. 'కొడుకు చదువుకి తాను ఆర్థిక సహాయం కోరినప్పుడు, ఏ పెద్దమనిషీ ముందుకు రాలేదు. బడిపంతులుకి అత్యాశ ఉండడం మంచిది కాదు...' వాళ్ల పరుషోక్తులూ, సలహాలూ మనస్సులో మెదలసాగాయి. అందువల్ల పురుషోత్తం మాటలు కటువుగా వినిపించాయి.

ఇక ఉండబట్టలేక 'ఇంతకూ మీరు వచ్చిన విషయమేమిటో చెప్పారు కాదు' అని కొంచెం కఠినంగానే అన్నాడు గురునాథం.

'మా అన్నగారు ఢిల్లీలో వున్న విషయం మీకు తెలుసుననుకుంటాను. వాళ్ల అమ్మాయి బి.ఇ.చేసింది. కంప్యూటర్ సైన్సులో ఘటికురాలు. మొన్న ఢిల్లీలో జరిగిన ఏదో ఎగ్జిబిషన్‌లో మా అమ్మాయి మీ అబ్బాయి కలుసుకున్నారట. మనస్సులు కలిశాయి కాబోలు, యిద్దరూ ప్రేమించుకున్నారు...'

గురునాథం ఉలిక్కిపడ్డాడు. ఆయన భార్యకైతే గుండె ఆగిపోయినంత పనయింది.

ఇంకా గురునాథం తేరుకోలేదు. 'ఎంతయినా ఆడపిల్లను కన్నవాడు గదా మా అన్నగారు. తొందరపడుతున్నాడు. మీరు కనక ఊ. అంటే చాలు అమ్మాయిని యిక్కడికే తీసుకువచ్చి చూపించి, మీకు నచ్చితే తాంబూలాలు పుచ్చుకుందామని అనుకుంటున్నాడు....చెప్పడం మరచిపోయాను...మా అన్నగారు వచ్చేనెల జర్మనీ వెడుతున్నాడు. తిరిగి రావడానికి కొన్ని రోజులు పట్టవచ్చు....' పురుషోత్తం మాటలు గురునాథానికి శ్రుతికటువుగా వినిపించాయి. సమాధానం ఏం చెప్పాలో తెలీక భార్యవంక చూశాడు.

'మీ అబ్బాయి కూడా ఢిల్లీలోనే ఉండాలని మనసుపడుతున్నాడట. బహుశా అక్కడే ఏదో పెద్ద హాస్పిటల్లో ఉద్యోగంలో చేరవచ్చు. మా అన్నగారు ప్రయత్నం చేస్తున్నాడట. ఆయన తలచుకుంటే కొండ మీదికోతినైనా తీసుకురాగలడు. నిన్ననే ఆయన వద్దనుంచి నాకు ఉత్తరం వచ్చింది....'

'మా అబ్బాయిని గురించి మీకే చాలా విషయాలు తెలుసు...' అంటూ అదోలా నవ్వాడు గురునాథం. నిజానికి నవ్వు తెచ్చుకున్నాడు.

'మా సంబంధం కలుపుకుంటే బావగారికి యిక ఎలాంటి యిబ్బందులూ వుండవు జీవితంలో, మీ శేషజీవితం హాయిగా గడిచి పోతుంది.' నవ్వుతూ అన్నాడు పురుషోత్తం.

'మేమేమీ మాట్లాడకముందే మీరు సంబంధం కలిపేశారు...' గురునాథం యింకా ఏదో చెప్పాలనుకుని కూడా చెప్పలేకపోయాడు.

మాటల కందని బాధ అప్పుడే ఆయన మనస్సుని ఆక్రమించింది. నరనరాలకు ఆ బాధ విస్తరించింది.

'మా అబ్బాయిని కనుక్కుని రెండు మూడు రోజుల్లో మా అభిప్రాయం చెపుతాము' అన్నది గురునాథం భార్య, ఆశాభంగాన్ని కప్పిపుచ్చుకుంటూ,

'మా ఆవిడ పిచ్చికాని, అబ్బాయిని కనుక్కునేందుకు ఏముందని! మీ అన్నగారు నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని అమలు పరిచేందుకు మా అబ్బాయి సిద్ధంగా వున్నాడు....' ఎంత నిగ్రహించుకోవాలన్నా, నిగ్రహించుకోలేకపోయాడు తన కోపాన్ని.

'అదేం మాట బావగారు...మీతో సంప్రదించకుండా మేము ఎలాంటి నిర్ణయాలు తీసుకోము. అబ్బాయి మీవాడు. కనక మిమ్మల్ని కాదని మేమేం చెయ్యగలం? పైగా అది సబబుకాదు....'

'మా వాళ్లు చెప్పినట్లుగా రెండు రోజుల్లో చెపుతానులెండి.' ముళ్లమీద కూర్చున్నట్టుగా అనుకున్నాడు గురునాథం. ఆయన భార్య మందహాసం చేసింది.

పురుషోత్తం సెలవు తీసుకుని వెళ్లిపోయాడు. ఆయన యింకా సందు దాటి వుండడు. అప్పుడే లోపలికి వచ్చాడు భానుమూర్తి. వస్తూనే, 'నా ఫ్రెండ్స్ యిద్దరు ఢిల్లీలో ప్రాక్టీస్ పెడదామనుకుంటున్నారు. అక్కడే ప్రస్తుతం ఏదన్నా హాస్పిటల్లో ఉద్యోగం చేద్దామని అనుకుంటున్నాను.' అన్నాడు.

'నువ్వు చెప్పకముందే నాకా సంగతి తెలిసింది.' గురునాథం కోపం యింకా చల్లారలేదు.

'ఎవరు చెప్పారు?' ఆదుర్దాగా అడిగాడు భానుమూర్తి.

'నీ క్కాబోయే మామగారి తమ్ముడు. ఇప్పుడే చెప్పివెళ్లాడు.'

'నల్లకారులో వెళ్లిన ఆయనేనా?'

'ఆయనే.'

రెండు క్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు. గురునాథం భార్య ఏదో చెప్పాలనుకుని కొడుక్కి దగ్గరగా వచ్చి కూర్చుంది.

గురునాధం మనస్సులో మండుతున్న అగ్నిపర్వతం బ్రద్దలయింది. 'నువ్విప్పుడు ప్రయోజకుడివయ్యావు. సొంతంగా ఎగిరేందుకు రెక్కలు వస్తున్నాయి. రెక్కలు వచ్చిన తర్వాత గూట్లో వుండమన్నా వుండలేవు. ఒక వేళ గూట్లో వుంచాలనుకున్నా వుంచలేను. నా కది తెలుసు. పరాయి వాళ్లెవరో చెప్పిన తర్వాత నిన్ను గురించి తెలుసుకోవలసిన దుస్థితి యేర్పడుతుందని మాత్రం నేనెన్నడూ అనుకోలేదు...'

'ఇందులో దుస్థితి ఏముంది?' టీపాయ్ మీద వున్న పత్రికను చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

'దుస్థితి కాకపోతే యిదేమిటి బాబూ...నీకోసం మేము ఎన్ని యిబ్బందులు పడ్డామో నీకూ తెలుసు. మమ్మల్ని ఉద్ధరిస్తావని కలలుకన్నాం. అలాంటప్పుడు...' తల్లి మాటకు అడ్డుతగిలి, 'నేనింకా పసిపాపాయిననే మీ అభిప్రాయం కాబోలు' అన్నాడు. కొడుకు.

తోకతొక్కిన తాచుగా మారింది తల్లి. 'కన్న కొడుకు ఢిల్లీకి రాజయినా, తల్లికెప్పుడూ పాపాయే...'

'తప్పులేదురా...కాని పెద్దవాళ్లమంటూ యింకా మేము బతికున్నాము. మాతో ఒక్కమాట చెపితే, నీకు వచ్చే నష్టమేమిటో నాకు తెలీడం లేదు...' అన్నాడు తండ్రి.

'అంతా అయిన తర్వాత చెపుదామనుకున్నాను...వ్యక్తత వచ్చిన కొడుకుగాని, కూతురుగాని తల్లిదండ్రుల చెప్పుచేతల్లోనే ఎప్పుడూ వుండాలనుకోవడం అవివేకం...'

'ఏమన్నావురా...అలా అనుకోవడం అవివేకమా! సంతానం కోసం కష్టపడడం వరకే కాదురా తల్లిదండ్రుల బాధ్యత...'

'నీకెవరో పాడుబుద్దులు నూరిపోశారు. లేకపోతే ఏమిట్రా యీ మాటలు...' తల్లి మందలించింది.

'కాబోయే మా మామగారిని ఎందుకలా ఆడిపోసుకుంటావు? ఢిల్లీ వంటి నగరంలోవుంటే నా జీవితం బాగుంటుందని ఆయన అనుకున్నాడు. నేనూ అలాగే అనుకున్నాను. అందులో తప్పేముంది?'

'తప్పంతా మాదేరా...నువ్వు మీ అమ్మని అంటే ఒకటీ నన్నంటే ఒకటీనా...' చివాలున కుర్చీలోంచి లేచి, కోపంతో వెళ్లిపోయాడు వీధిలోకి గురునాథం.

భానుమూర్తి తన గదిలోకి వెళ్లిపోయాడు.

తల్లిమాత్రం శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది.

భానుమూర్తి తనకు నచ్చిన ఢిల్లీ అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. మామగారు చెప్పినట్టుగా ఒక హాస్పిటల్‌లో చేరాడు. ఆయనకు వేరే సంతానం లేదు.

ఢిల్లీలో ఆయనకి పెద్దఫ్లాటు ఉంది. అదేకాక డబ్బూదస్కం బోలెడు తనకు సంక్రమించినట్టుగా భానుమూర్తి కలలు కన్నాడు. మామగారు, తాను, తనభార్య..ముగ్గురి సంపాదనతో ఢిల్లీలో ఒక పెద్ద నర్సింగ్‌హోమ్ అనతికాలంలో అవతరిస్తుందనీ తనప్పుడు గొప్ప డాక్టరుగా ప్రసిద్ధుడనవుతాననీ అనుకున్నాడు. ఆ డబ్బు, ఆ పేరు, ఆ హోదా.... తల్లిదండ్రుల వద్ద ఉంటే ఎన్నటికైనా కలిగేనా అనుకుని ఊహలు పెంచుకున్నాడు.

ఎవరినీ లక్ష్యపెట్టకుండా రోజులు గడిచిపోతున్నాయి. తండ్రీ కొడుకు మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు లేవు. రాకపోకలు లేవు. ఒకరికొకరు పరాయివారుగా కనిపించారు.

ఎందుకిలా జరిగింది బాధపడ్డాడు మొదట్లో గురునాథం. అతి ప్రేమ వల్లనా? పెంచుకున్న ఆశల వల్లనా? పొందిన వియ్యం వల్లనా? కయ్యం కోసమా వియ్యం పొందింది? జరిగిన తప్పు తన వల్లనా, కొడుకువల్లనా, వియ్యంకుడి వల్లనా? ప్రశ్నలే కాని ప్రత్యుత్తరాలు లభించలేదు గురునాధానికి. 'కయ్యానికైనా వియ్యానకైనా సమవుజ్జీ అవసరం' అన్న పాత అభిప్రాయాన్ని గుర్తు చేసుకుంది ఆయన భార్య.

కాలగమనంతోపాటు ఎన్నో విషయాలు పాతబడ్డాయి. కొన్ని స్మృతిపథంలోంచి తొలగిపోయాయి.

భానుమూర్తికి కొడుకు పుట్టాడన్న శుభవార్త తెలపడం కోసం ఒకనాడు పురుషోత్తం గురునాథం యింటికి వెళ్లాడు. తలుపు వేసి వుంది.

'గురునాథం గారూ' తలుపు కొడుతూ పిలిచాడు.

నడివయస్సులో ఉన్న ఒకామె తలుపు తెరిచింది. 'ఎవరు కావాలి మీకు?' అడిగింది.

'గురునాథంగారు యింట్లో లేరా?' సందేహంగా అడిగాడు.

'మూడు నెలలక్రితం ఆయన భార్య నీళ్లబిందె తెస్తూ కాలుజారి పడ్డారు. కాలు ఫ్రాక్చరయింది. హాస్పిటల్లో ఒక నెలరోజులున్నారు...' ఆమె చెప్పుకుపోతోంది జరిగిన కథను.

'ఇప్పుడెక్కడున్నారు?'

'రామాలయం పక్కవీధిలో...'

'అలాగా!' అంటూ పురుషోత్తం ఆ వీధికి బయలుదేరాడు. ఇద్దరు ముగ్గురుని వాకబు చేసి గురునాథం అద్దెకుంటున్న యిల్లు కనుక్కున్నాడు. ఆయన కంటికి అది ఒక యిల్లులా కనిపించలేదు. కాని ఆయనకి ఇంటిముందు తాటికాయంత అక్షరాలతో ఉన్న బోర్డు కనపించింది. దాని మీదికి మళ్లింది ఆయన దృష్టి.

'చుల్కగా నయ మగుచుండును పుండు, నాల్కచే కాల్చి మాన్పగ లేడెవండు.'